సాక్షి
కర్నూలు
గురువారం । 24 । జూలై । 2025



ఈరన్న వైభవానికి వేళాయె

ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఆగస్టు 23 వరకు జరుగుతాయి. సోమ, గురువారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.
8లో▸



'ఉపాధి' నిధులతో పశువుల షెడ్లు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో పశువుల షెడ్లు నిర్మించనున్నారు. కర్నూలు జిల్లాకు 1,200, నంద్యాల జిల్లాకు 850 పశువుల షెడ్లు మంజూరయ్యాయి.
8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.64
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.604
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:29,546
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,557

న్యూస్‌రీల్

జిల్లాలో పెరిగిన ఈదురు గాలుల తీవ్రత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు అంతంతమాత్రం పడుతుండగా ఈదురు గాలుల తీవ్రత పెరిగింది. చలితో కూడిన ఈదురు గాలులతో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 9 మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. చిప్పగిరిలో 18.6 మి.మీ., హాలహర్విలో 16.4, హొళగుందలో 7.4, మద్దికెరలో 7.2, ఆలూరులో 4.6, పత్తికొండలో 3.2, ఆదోనిలో 1.6, కౌతాళంలో 0.8, తుగ్గలిలో 0.4 మి.మీ ప్రకారం వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 67 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న నాలుగైదు రోజుల్లో కూడా ఈదురుగాలులు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 2.19 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వర్షాలు అంతంతమాత్రం కావడంతో పంటల్లో ఎదుగుదల లోపించింది.

2న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఆగస్టు 2న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఈ సమావేశాలను ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య , వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పనులు, ఆర్థిక ప్రణాళిక అంశాలపై సమీక్ష చేపడతామన్నారు. సమావేశాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు తమకు కేటాయించిన సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

ఐదు పంపులతో 'హంద్రీ-నీవా'కు నీరు



మల్యాల నుంచి హంద్రీ-నీవా కాలువకు నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: హంద్రీ- నీవా సుజల స్రవంతి పథకం కాలువకు నీటి విడుదలను బుధవారం పెంచారు. మల్యాల నుంచి ఐదు పంపులతో కాలువకు నీరు విడుదల చేస్తున్నారు. ఈ నెల 17న సీఎం చంద్రబాబు నాయుడు మల్యాల దగ్గర మోటర్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఆ రోజున మొదటగా 3 పంపులు ద్వారా 1013 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. మంగళవారం మరో మోటర్‌ను పెంచి అదనంగా 337 క్యూసెక్కుల నీటిని పెంచి, బుధవారం మరో మోటర్‌ను ఆన్ చేసి, మొత్తం 5 మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. కృష్ణా జలాలు బుధవారం రాత్రికి అనంతపురం జిల్లాలోని జీడీపల్లి రిజర్వాయర్‌కు చేరుకున్నట్లు హంద్రీనీవా ఇంజినీర్లు తెలిపారు.

సెప్టెంబర్ 4న గణేశ్ నిమజ్జనోత్సవం

కర్నూలు కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలు ఆగస్టు 27వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.వేణుగోపాల్, గోరంట్ల రమణ తెలిపారు. కర్నూలు నగరంలో 9వ రోజు సెప్టెంబర్ 4వ తేదీన వినాయక విగ్రహాల నిమజ్జనం ఉంటుందని పేర్కొన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, గూడూరు, కోడుమూరు తదితర ప్రాంతాల్లో 5వ రోజు ఆగస్టు 31వ తేదీన నిమజ్జన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్థానిక ఉత్సవ సమితుల కార్యకర్తలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

'డీబీటీకి ప్రత్యేక ఖాతాలు అవసరం లేదు'

కర్నూలు(అగ్రికల్చర్): డీబీటీ కోసం మళ్లీ బ్యాంకుల్లో ఖాతా తెరవాల్సిన అవసరం లేదని ఎల్‌డీఎం రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏ బ్యాంకులోనైనా ఇప్పటికే ఖాతా ఉన్న వారు తమ ఆధార్‌ను ఎన్‌పీసీఐలో మ్యాపింగ్ చేయించుకుంటే సరిపోతుందన్నారు. జిల్లాలోని అన్ని బ్యాంక్ శాఖల్లో ఆధార్ నెంబర్‌తో ఎన్‌పీసీఐ మ్యాపింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను లింక్ చేయించుకొని డీబీటీ ద్వారా ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చన్నారు. కొంతమంది ప్రజల్లో అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి వాటిని నమ్మవద్దని పేర్కొన్నారు.

వరుణుడు ఊరిస్తూ.. యూరియా వెక్కిరిస్తూ!



కొత్తపల్లి మండలం ఎం.లింగాపురం శివారులో యూరియా స్టాక్‌పాయింట్ వద్ద రైతుల పడిగాపులు

ఉక్కిరిబిక్కిరి చేస్తున్న యూరియా కొరత

- మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ పశ్చిమ ప్రాంతానికే తరలింపు
- పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లపై కూటమి నేతల పెత్తనం
- నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ డీలర్లకు కేటాయింపులు
- బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- కర్నూలు ర్యాక్ పాయింట్ యూరియా నంద్యాలకు..
- మండల కేంద్రాల్లో రైతుల పడిగాపులు

కర్నూలు జిల్లాలో ఇలా..

ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 2.19 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇటీవల వర్షాలు పడటం వల్ల పత్తికి యూరియా వాడుతున్నారు. ఇప్పుడిప్పుడే ఎల్‌ఎల్‌సీకి నీళ్లు వదలడం వల్ల వరిసాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ శాఖ ఇచ్చిన సప్లయ్ ప్లాన్ ప్రకారం ఏప్రిల్ నుంచి జూలై వరకు జిల్లాకు 18,845 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 15,577 టన్నులు వచ్చింది.

నంద్యాల జిల్లాలో ఇలా..

ఖరీఫ్ సాధారణ సాగు 2.38 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 95 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. నంద్యాల జిల్లాకు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 18,293 టన్నులు రావాల్సి ఉండగా.. 14,427 టన్నులు మాత్రమే వచ్చింది.

.. ఉమ్మడి జిల్లాలో కాల్వకు నీళ్లు వదలడంతో వరి సాగుకు అవకాశం ఏర్పడింది. ఈనేపథ్యంలో ఇప్పటి వరకు యూరియాకు మరింత డిమాండ్ ఏర్పడనుంది. అయితే అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడంతో రైతులకు కంటి మీద కునుకు దూరమవుతోంది.



పాస్‌పుస్తకాలు క్యూలో పెట్టి నిరీక్షిస్తున్న రైతు సుంకన్న

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వచ్చిన యూరియాలో 50 శాతం టీడీపీ నేతలు, మద్దతుదారుల తరలించుకుపోగా.. మిగిలిన అరకొర యూరియాను దక్కించుకునేందుకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ వ్యయప్రయాసలకోర్చి మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రోడ్డెక్కుతున్నా ఫలితం లేకపోతోంది. కూటమి ప్రభుత్వంలో రైతుల దీనావస్థలకు యూరియా కొరత అద్దం పడుతోంది. కర్నూలు జిల్లాకు సంబంధించి మార్క్‌ఫెడ్‌లో 5వేల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్‌లో ఉండాలి. ఇలా ఉంటే ఏ ప్రాంతంలో కొరత ఉంటే అక్కడకు సరఫరా చేసే వీలుంటుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా మార్క్‌ఫెడ్‌లో యూరియా బఫర్ అనేది లేకుండా పోయింది. ఇప్పటి వరకు బఫర్‌లో ఉన్న యూరియాను వ్యవసాయ శాఖ ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు డివిజన్‌లకు ఇస్తున్నారు. మార్క్‌ఫెడ్‌లోని బఫర్ స్టాక్ మొత్తం పశ్చిమ ప్రాంతానికి తరలించినప్పటికీ కొరత కొనసాగుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు రోజుల తరబడి ఆర్‌బీకేలు, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లకు చుట్టు తిరగాల్సి వస్తోంది. ఆదోని, కౌతాళం, ఆలూరు, హొళగుంద, పెద్దకడుబూరు, దేవనకొండ, ఎమ్మిగనూరు, హాలహర్వి మండలాల్లో యూరియా కోసం నిత్యం రైతులు రోడ్డెక్కుతున్నారు. తుంగభద్ర తీరం వెంట వరి సాగు మొదలవుతుండటం వల్ల యూరియాకు డిమాండ్ ఏర్పడింది. అయితే మార్క్‌ఫెడ్‌లో యూరియా అనేదే లేకపోవడంతో రానున్న రోజుల్లో కొరత మరింత తీవ్రం కానుంది. నంద్యాల జిల్లాకు సంబంధించి మార్క్‌ఫెడ్‌లో జూలై మొదట్లో 9వేల టన్నుల యూరియా నేడు 1500 టన్నులకు పడిపోయింది. నంద్యాల జిల్లాకు జూలై నెలలో ఒక్క ర్యాక్ కూడా రాలేదు. ఇందువల్ల మార్క్‌ఫెడ్‌లో ఉన్న యూరియా క్రమంగా ఖాళీ అవుతోంది. యూరియా కోసం నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడుతూరు, ఆత్మకూరు, కొత్తపల్లి, బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో కొద్ది రోజులుగా రైతులు పోరాటం చేయాల్సి వస్తోంది.

నిబంధనలకు పాతర

జిల్లాకు వచ్చే యూరియా సహా అన్ని రకాల రసాయన ఎరువుల్లో నిబంధనల ప్రకారం 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, 50 శాతం ప్రయివేటు డీలర్లకు ఇవ్వాల్సి ఉంది. అలా చేసినప్పుడే అత్యవసరం ఉన్న ప్రాంతాలకు కేటాయింపులు చేపట్టి కొరతను నివారించవచ్చు. ఇటీవల ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన 1500 టన్నుల యూరియా కర్నూలు ర్యాక్‌పాయింట్‌కు వచ్చింది. ఇందులో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు ఇవ్వాల్సి ఉండగా.. ఒక్క టన్ను కూడా ఇవ్వలేదు. మొత్తం 1500 టన్నుల యూరియాను వ్యవసాయ యంత్రాంగం ప్రయివేటు డీలర్లకే ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. ప్రయివేటు డీలర్లకు కేటాయించిన విషయం కూడా బయటకు పొక్కనివ్వకపోవడం గమనార్హం. ఈ యూరియా మొత్తాన్ని ప్రయివేటు డీలర్లు బ్లాక్‌లో సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.

కర్ణాటక నుంచి తెచ్చుకుంటున్నాం



మాకు 30 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే పత్తి, కంది సజ్జ తదితర పంటలు వేశాం. ఇటీవల వర్షాలు పడటంతో పత్తికి యూరియా అత్యవసరం. కాల్వలకు నీళ్ల వదలడం వల్ల వరి సాగుకు కూడా సిద్ధమవుతున్నాం. అయితే యూరియా దొరకని పరిస్థితి. జూలై నెలలో ఒక్క బస్తా కూడా అందుబాటులో లేదు. హొళగుంద మండలంలో ఏ ఒక్క ఆర్‌బీకేలో కూడా యూరియా లేదు. కర్ణాటకకు వెళ్లి రూ.400 ప్రకారం యూరియా తెచ్చుకుంటున్నాం.

– మలిగిరి మల్లికార్జున, మాజీ సింగిల్‌విండో చైర్మన్, హొళగుంద

పడిగాపులు కాస్తున్నాం



కాల్వలకు నీళ్ల వదలడంతో వరి సాగుకు సిద్ధమవుతున్నాం. 9 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. ఇంతవరకు వర్షాలు లేవు. ఇటీవలనే వర్షం కురిసింది. ఈ సమయంలో యూరియా వేస్తేనే పంట బాగా వస్తుంది. పది రోజులుగా యూరియా కోసం చేయని ప్రయత్నం లేదు. సొసైటీలకు వస్తున్న ఎరువులను పలుకుబడి కలిగిన వారు తరలించుకుపోతున్నారు. నాలాంటి సామాన్య రైతులు అన్ని పనులు వదులుకొని రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నాం.

– మహబూబ్‌బాషా, మల్యాల గ్రామం, నందికొట్కూరు మండలం

కర్నూలు యూరియా నంద్యాల జిల్లాకు..

కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు, ఆదోనిల్లో ర్యాక్ పాయింట్లు ఉన్నాయి. నంద్యాల జిల్లాకు నంద్యాలలో మాత్రమే ర్యాక్ పాయింట్ ఉంది. కొరత ఉన్నప్పుడు ఏ జిల్లా ర్యాక్ పాయింట్‌కు వచ్చిన యూరియాను ఆదే జిల్లాలోని మార్క్‌ఫెడ్‌కు, ప్రయివేటు డీలర్లకు కేటాయించాలి. కానీ కర్నూలు ర్యాక్‌పాయింట్‌కు వచ్చిన యూరియాను నంద్యాల జిల్లాలోని వ్యవసాయ శాఖకు చెందిన డోన్, నందికొట్కూరు. ఆత్మకూరు డివిజన్‌లకు కూడా కేటాయిస్తున్నారు. నంద్యాల జిల్లాకు వెళ్లిపోయే ఎరువులకు కూడా కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారులే అనుమతులు ఇస్తుండటం గమనార్హం.

టీడీపీ నేతలు, మద్దతుదారులకే యూరియా

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్‌బీకేలకు రసాయన ఎరువులు ఇవ్వడం తగ్గిపోయింది. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లకు పెద్దపీట వేస్తున్నారు. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లు కూటమి నేతల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా టీడీపీ నేతలు, వారి సన్నిహితులు, మద్దతుదారులకే చేరుతోంది. సాధారణ రైతులకు బస్తాకూడా దొరకని పరిస్థితి ఏర్పడింది.

ఆర్‌టీఏ కార్యాలయంలో 'ప్రైవేట్'కు కట్టడి

- అజ్ఞాతంలోకి వసూళ్ల రాయుళ్లు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు: రవాణా కార్యాలయం వద్దకు దళారులు(ఏజెంట్లు) రాకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు. కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల ద్వారా మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో 'ప్రైవేటు వసూళ్లు–లెక్కతప్పని పంపకాలు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి డిప్యూటీ కమిషనర్ శాంతకుమారి స్పందించారు. కార్యాలయం ప్రధాన గేటు వద్ద ప్రత్యేకంగా హోమ్‌గార్డును ఏర్పాటు చేసి కట్టుదిట్టం చేశారు. కర్నూలు నగరంలో దాదాపు 50 మందికి పైగా ఆర్‌టీఏ ఏజెంట్లు ఉన్నారు. ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయంలోకి వారు వెళ్తుంటారు. అయితే 'సాక్షి'లో వెలుబడిన కథనానికి స్పందించి ఏజెంట్లను కార్యాలయంలోకి అనుమతించకుండా కట్టుదిట్టం చేశారు. వసూళ్ల కోసం కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసుకున్న ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు సత్యం, హరుణ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కార్యాలయ పరిపాలనా విభాగం సిబ్బందితో పాటు అధికారులతో డీటీసీ ప్రత్యేకంగా సమావేశమై కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై వరుస కథనాలు వస్తున్న నేపథ్యంలో కట్టడికి చర్యలు చేపట్టారు. ప్రైవేటు వ్యక్తులను ఎలాంటి పరిస్థితుల్లో ఆఫీసులోకి అనుమతించవద్దని సిబ్బందికి ఆదేశించారు. వాహన దారులకు అందించే సేవల్లో మార్పు రావాలని, ఎలాంటి పరిస్థితుల్లో ఇబ్బందులు పడకుండా వారికి సేవలు అందించాలని డీటీసీ సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు

కర్నూలు(సెంట్రల్): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వ్యవసాయాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణీపై ప్రతి షాపును తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఆదోని, కౌతాళం మండలాల్లో యూరియా పంపిణీపై సబ్ కలెక్టర్‌ను ఆరా తీశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు బంగారు కుటుంబాల దత్తత జూలై 31లోపు పూర్తి కావాలన్నారు. తాగునీటికి ఇబ్బందికి ఉంటే రవాణా చేయాలని ఆదేశించినప్పటికీ క్షేత్ర స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తుగ్గలి మండలం ముక్కెళ్ల, హాలహర్వి మండలం చింతకుంటలో 20 రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతోందని, ఇ నీరు కూడా రంగు మారి వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. వెంటనే ఆయా గ్రామాల్లో పరిస్థితులను సరిచేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సీపీఓ హిమ ప్రభాకరరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ పాల్గొన్నారు.

కర్నూలుకు నీటి సమస్య తలెత్తనీయొద్దు

- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా



హంద్రీ- నీవా కాలువను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, అధికారులు

కల్లూరు: కర్నూలు నగరానికి నీటి సమస్య తలెత్తకుండా హంద్రీ– నీవా ప్రధాన కాల్వ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ డీఈని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద హంద్రీ–నీవా కాలువ విస్తరణ పనులను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. నీటి విడుదల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా హంద్రీ–నీవా కాలువ నీటితో 68 చెరువులను నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణగిరి, పత్తికొండ రిజర్వాయర్‌తో పాటు అన్ని తూముల ద్వారా ఆయకట్టుకు నీటిని ఇవ్వాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ ఈఈ ప్రసాద్‌రావు, డీఈఈ కొండన్న, చెన్నయ్య, తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రెండో రోజూ ముగ్గురే!



శిక్షణకు హాజరైన మహిళా జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి ప్రారంభమైన మహిళా జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణకు రెండో రోజైన బుధవారం కూడా ముచ్చటగా ముగ్గురే హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తమకు మండలాల్లో తమకు ఎలాంటి విలువను ఇవ్వడం లేదని, 19 నెలలుగా గౌరవ వేతనాలను కూడా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచారని జెడ్పీటీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలోని మహిళా జెడ్పీటీసీ సభ్యులకు ' మహిళా నాయకత్వంలో మార్పు – స్థానిక స్వపరిపాలనలో సాధికారత ' అనే అంశంపై మూడు రోజుల శిక్షణను స్థానిక జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనంలో ప్రారంభించారు. మొదటి రోజున ముగ్గురు మహిళా జెడ్పీటీసీ సభ్యులు హాజరు కాగా, 2వ రోజు శిక్షణకు కూడా ముగ్గురే (జెడ్పీ వైస్ చైర్మన్, హొళగుంద జెడ్పీటీసీ సభ్యురాలు కురువ బుజ్జమ్మ, గోస్పాడు నుంచి పీ జగదీశ్వరమ్మ, బండి ఆత్మకూరు నుంచి రామతులశమ్మ) మాత్రమే హాజరయ్యారు. హాజరైన ముగ్గురు జెడ్పీటీసీ సభ్యులకు రిసోర్స్ పర్సన్స్ జీ నగేష్, కే రవికిశోర్ పలు అంశాలను వివరించారు.

'నీ అంతు చూస్తా.. విధుల నుంచి తొలగిస్తా'

- కించపరిచేలా మాట్లాడిన ఉరుకుంద ఆలయ ఈఓ
- సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ట్రాన్స్‌కో ఏఈ



ఏఈ నర్సన్న

కౌతాళం: 'నీ అంతు చూస్తా.. నిన్ను విధుల నుంచి తొలగిస్తా' అని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తనను కించపరిచేలా మాట్లాడారని ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న ఆదోని సబ్ కలెక్టర్‌కు మౌర్య భరద్వాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సన్న విలేకరులతో మాట్లాడుతూ.. ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం విద్యుత్ పనులు చేపడుతున్నామన్నారు. అయితే ఈఓ చులకనగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. ఈఓపై కౌతాళం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళితే కేసు తీసుకోలేదన్నారు. జరిగిన ఘటనను తమ శాఖ అధికారులకు తెలిపి తమశాఖ అధికారులతో కలిసి ఆదోని సబ్‌కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కళ్యాణ కట్ట వద్ద విద్యుత్ స్తంభాలను మార్చాలని ఈఓ ఆదేశించారని, ఆ స్తంభాలు మార్చాలంటే ఎస్టిమేట్ వేయాలని తెలిపినా వినిపించుకోకుండా అనుచితంగా ప్రవర్తించారన్నారు. ఆలయ ఈఓపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఉచిత బస్సును ప్రవేశపెడితే ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోతారని, వారికి నెలకు రూ.15 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ న్యూసిటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని రూట్లలో ప్రైవేట్ బస్సులకు అనుమతులు ఇవ్వడంతో ఆటోలకు సరైన బాడుగలు దొరకడం లేదన్నారు. ఉబర్, ఓలా తదితర యాప్‌లకు అనుమతి ఇవ్వడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు బి.రాధాకృష్ణ, మాలిక్‌బాష, షంషీర్‌బాష, మళ్లి, శీను, సురేష్, రంగన్న,రాజశేఖర్, మధు, శివకృష్ణ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆశా పోస్టులకు కుప్పలుగా ఎమ్మెల్యేల లేఖలు

- ఒక్కో పోస్టుకు పది వరకు లెటర్లు ఇచ్చిన ప్రజాప్రతినిధులు

కర్నూలు(హాస్పిటల్): ఆశా వర్కర్ పోస్టులకు స్థానిక మహిళల నుంచి భారీగా డిమాండ్ ఉంది. దీంతో అధిక శాతం స్థానిక ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో పోస్టుకు ప్రజాప్రతినిధులు పది వరకు లెటర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 32, పట్టణ ప్రాంతాల్లో 12 ఖాళీలకు అధికారులు గత నెల 23న ప్రకటన ద్వారా దరఖాస్తులను ఆహ్వానించారు. గత నెల 28వ తేదీ వరకు దరఖాస్తులను ఆయా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో మెడికల్ ఆఫీసర్లు స్వీకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీల నుంచి ఒక్కో పోస్టుకు పది దాకా, పట్టణాల్లోని యూపీహెచ్‌సీల్లో ఒక్కో పోస్టుకు 60 మంది దాకా దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్ ప్రకారంగా మెడికల్ ఆఫీసర్లు జాబితా తయారు చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పంపిస్తున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి స్క్రూటినీ చేసి మెరిట్ జాబితాను అనుసరించి డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ(డీహెచ్ఎస్) ఆధ్వర్యంలో ఎంపికలు జరగనున్నాయి. అయితే ఆశా వర్కర్ పోస్టులకు ఎమ్మెల్యేల లేఖలను సంపాదించి దరఖాస్తుకు జతచేస్తున్నారు. ఇలా దాదాపు వంద దాకా ఎమ్మెల్యేల లేఖలు ఉన్నట్లు సమాచారం. ఒకే పోస్టుకు ఎక్కువ మంది రావడంతో వచ్చిన వారందరికీ కాదనకుండా ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారని సమాచారం. ఒక్కో పోస్టుకు 4 నుంచి 6 దాకా లేఖలు రావడంతో అధికారులు వాటిని పక్కన పెట్టారు. మెరిట్ ఎవరికి ఉంటే వారినే ఎంపిక చేయాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిసింది.

కార్పొరేషన్ టెండర్లపై మంత్రి అనుచరుడి కన్ను

పాణ్యం ప్రజాప్రతినిధికి, కర్నూలు మండల నేతకు 6 శాతం పర్సంటేజీలు

- కాంట్రాక్టర్ల సమావేశంలో ఏకపక్ష నిర్ణయం

కర్నూలు(టౌన్): ''అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు పోటీ పడాల్సిన అవసరం లేదు. సిండికేట్ అవుదాం.. పనులను పంచుకుందాం.. అంచనా విలువ కన్నా తక్కువకు పోటీ పడాల్సిన అవసరం లేకుండా టెండర్లన్నింటినీ ఎక్సెస్‌కు వేద్దాం. నేనే చూసుకుంటా. అయితే పాణ్యంలో ఓ అధికార పార్టీ నేతకు, కర్నూలు మండలంలో ఓ నేతకు పనుల్లో 6 శాతం పర్సంటేజీలు ఇచ్చుకోవాలి. లేదంటే కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టేది లేదు. అగ్రిమెంట్ సమయంలో 3 శాతం, బిల్లుల సమయంలో 3 శాతం ఇవ్వాలి. ఈ ప్రక్రియ అంతా చక్కబెడతా. అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.'' అని ఓ మంత్రి అనుచరుడు భరోసా కల్పించారు. కార్పొరేషన్ టెండర్లపై ఆయన కన్ను పడింది. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక బుధవారపేట సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో మంత్రి అనుచరుడు మున్సిపల్ కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో వాటాలు ఏవిధంగా పంచుకోవాలి.. ఎవరెవరికి ఎంత ఇచ్చుకోవాలనే విషయమై సుదీర్ఘంగా చర్చించారు.

నేడు రేపు టెండర్ల ప్రక్రియ

ఈనెల 24, 25 తేదీల్లో నగరపాలక డ్రాయింగ్ బ్రాంచ్ టెండర్లు పిలిచింది. 24వ తేదీ 16 వర్కులు, 25వ తేదీ 17 వర్కుల చొప్పున రూ.2.50 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనుల కోసం టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. దీంతో మంత్రి అనుచరుడు తెరపైకి వచ్చి కాంట్రాక్టర్లతో బేరాసారాలు కుదుర్చుకున్నాడు. లెస్‌లు వద్దు.. అన్ని పనులు ఎక్సెస్ వేసుకుందాం అని నిర్ణయించారు. కేవలం పర్సంటేజీల కోసం అంచనా విలువ కన్నా ఎక్కువకు టెండర్ కోట్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత ప్రభుత్వంలో టెండర్ల ప్రక్రియ ఎంతో పారదర్శకంగా నిర్వహించారు. ఎక్సెస్ అన్న పదం లేకుండా అభివృద్ధి పనులు చేపట్టారు. మరి ప్రస్తుత టెండర్లలో ఎక్సెస్‌కే అధికారులు మొగ్గు చూపుతారా? లేదా అడ్డుకుంటారా? అన్నది వేచి చూడాలి.

క్లుప్తంగా

విరిగిపడిన గాలిమర రెక్క



గాలిమర రెక్కను పరిశీలిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని కె.వెంకటాపురం గ్రామానికి చెందిన చిన్న కొలుట్లయ్య అనే రైతు పొలంలో బుధవారం ఉదయం గాలిమర రెక్క ఒకటి విరిగి పడింది. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల పొలాల వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సదరు కంపెనీ వారికి సమాచారం అందించారు. గాలిమర రెక్క విరిగి పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గుర్తు తెలియని మహిళ మృతి



మంత్రాలయం రూరల్: మంత్రాలయంలోని తుంగభద్ర నదిలో పుష్కర ఘాట్, సంతమార్కెట్ ఘాట్ మధ్యలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైంది. బుధవారం ఉదయం పుష్కర ఘాట్ వైపు తుంగభద్ర నది వద్ద స్నానానికి వెళ్లిన భక్తులు నదిలో కొట్టుకొస్తున్న మహిళ శవాన్ని గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మహిళ శవాన్ని ఒడ్డుకు చేర్చారు. ఆమె వయసు 55 ఏళ్లు ఉంటుందని, లైట్ గ్రీన్ కలర్ శారీ ధరించి ఉన్నట్లు చెప్పారు. స్థానిక వీఆర్వో భీమయ్య ఫిర్యాదు మేరకు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ కేసు నమోదు చేశారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు మంత్రాలయం సీఐ 91211 01151, ఎస్ఐ 91211 01152 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు.

క్యాంపస్ సేఫ్ స్పెషల్ డ్రైవ్



బంకులో తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు(న్యూటౌన్): విద్యాసంస్థల వద్ద 100 గజాల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించడాన్ని నిషేధించారని, దీనిపై 'ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్' స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలను సందర్శించి 100 గజాలలోపు ఉన్న టీ, పాన్, కిరాణం షాపులలో సిగరెట్లు, ఖైనీ, గుట్కా పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధించినట్లు నిర్వాహకులకు తెలియజేశారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యాసంస్థల వద్ద తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న 1441 షాపుల యజమానులపై సీఓటీపీఏ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి రూ.2,24,310 జరిమానా విధించారు. నిబంధనలు ఉల్లంఘించి పొగాకు ఉత్పత్తులు, గుట్కా విక్రయిస్తే షాపులను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం దుకాణంలో చోరీ

కర్నూలు(రూరల్):కల్లూరు మండలం అబ్బాస్ నగర్‌లోని పి.ఆర్.వైన్స్ దుకాణంలో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి వ్యాపారం ముగిసి న తరువాత దుకాణానికి తాళం వేసి నిర్వాహకులు వెళ్లిపోయారు. రాత్రి దొంగలు దుకా ణం వెనుక భాగన రంధ్రం చేసి లోపలికి ప్రవేశించి రూ.80 వేలు విలువ గల మద్యం బాటిళ్ల ను మూటకట్టుకొని ఉడాయించారు. నిర్వాహ కులు యథావిధిగా బుధవారం ఉదయం తా ళం తెరిచి పరిశీలించగా కొన్ని మద్యం బాటిళ్లు కనిపించలేదు. దుకాణం వెనుకవైపు ఉన్న రంధ్రాన్ని చేసి చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకొని నాలుగవ పటణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఉరుకుంద ఈరన్న స్వామి మూల విరాట్



ప్రతి ఇంట్లో ఆయన నామమే

స్వామి ఆశ్రయం పొందిన గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో ఏ ఇంటికి వెళ్లినా స్వామి నామమే. ప్రజలందరి పేర్లు ఈరన్న, ఈరమ్మ, నాగరాజు, నాగమ్మ, వీరేష్, వీరన్న ఇలా వినిపిస్తాయి. తమ పిల్లలకు స్వామి పేరు పెట్టడం వల్ల అంతా శుభం జరుగుతుందని భక్తులు భావిస్తున్నారు.

శ్రావణ మాస ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఉరుకుంద ఈరన్న వైభవానికి వేళాయె

- రేపటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి క్షేత్రం భక్తజనుల పుణ్యధామంగా నిత్యం పూజలందుకుంటూ మహాక్షేత్రంగా వెలుగొందుతోంది. మహిమాన్వితుడైన ఈరన్న స్వామిని మనసా, వాచా కొలిస్తే అంతా శుభమే జరుగుతుందనే నమ్మకం భక్తుల్లో ఉంది. స్వామి వారి పాదాలను తాకితే సర్వపాపాలు హరించి ముక్తి మార్గం సంప్రాప్తిస్తుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. కౌతాళం మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉరుకుంద గ్రామంలో వెలసిన క్షేత్రమే ఈరన్న (నరసింహ) స్వామి పుణ్యక్షేత్రం. ఇక్కడ స్వామి వారు మహిమాన్వితుడిగా వెలుగొందుతూ నిత్యం పూజలందుకుంటున్నారు. రోజూ వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ఈ నెల 25 నుంచి ప్రారంభమై ఆగస్టు 23వ తేదీ వరకు జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా సోమ, గురువారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. మూడవ సోమవారం దాదాపు 3 లక్షలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. చివరి సోమవారం స్వామివారి పల్లకోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలు ముగిసే వరకు ఈ ప్రాంతవాసులు మద్యపానానికి, మాంసాహారానికి దూరంగా ఉంటారు.

నిత్యాన్నదానం

ఆలయం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఎంతమంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ఈ కార్యక్రమాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేక భవనాన్ని విశాలమైన ప్రదేశంలో నిర్మించారు. జీప్లస్ భవ న నిర్మాణం కోసం రూ.2.30 కోట్లతో ప్రతిపాదన లు పంపారు. మధ్యాహ్నం, రాత్రి వేళలోనూ భక్తులకు అన్నదానం చేస్తారు. శ్రావణ మాసంలో భక్తుల కోసం మూడు చోట్ల అన్నదానం చేయనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు.



ఐదు గోపురాలతో స్వామి వారి ఆలయం

స్వామి వారి ఆదాయం

భక్తులు పలు రూపాల్లో స్వామివారికి కానుకలు సమర్పిస్తుంటారు. నిత్యాన్నదానం పథకానికి రూ.6 కోట్ల వరకు డిపాజిట్లు ఉన్నట్లు డీసీ తెలిపారు. అలాగే 3.50 కేజీ బంగారం గోల్డ్‌బాండ్‌ల రూపంలో ఉందని, 2 కేజీల వరకు భక్తులు ఇచ్చిన బంగారం కానుకల రూపంలో ఉందన్నారు. వెండి 1400 కేజీలు బ్యాంక్ లాకర్‌లో ఉందని, 750 కేజీల వరకు కానుకల రూపంలో దేవాలయంలో ఉందని డీసీ తెలిపారు.

రవాణా సౌకర్యం

ఆదోని, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, శిరుగుప్ప, రాయచూరు, సింధనూరు ఆర్టీసీ వారు ఉరుకుంద ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఆదోని, ఎమ్మిగనూరుకు చేరుకున్న భక్తులకు అక్కడి నుంచి ఉరుకుందకు వెళ్లేందుకు బస్సులు సిద్ధంగా ఉంటాయి.

దర్శనీయ స్థలాలు

స్వామిని దర్శించుకున్న భక్తులు ఆలయం వెనుక ఉన్న ఆంజనేయ స్వామి, నాగుల స్వామి, బసవన్న కట్టను దర్శించుకోవడం ఆనవాయితీ. ఉరుకుంద నుంచి 5 కి.మీ. దూరంలో పలికే దేవుడిగా పేరుగాంచిన బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి దేవస్థానం ఉంది. ఉరుకుందకు 15 కి.మీ దూరంలో మేళిగనూరు వద్ద శ్రీరాముని చేత ప్రతిష్ఠించబడిన రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. అలాగే 40 కి.మీ. దూరంలో మంత్రాలయం మఠం ఉంది.

మాస్టర్ ప్లాన్ ఆధారంగా అభివృద్ధి పనులు

మాస్టర్‌ప్లాన్ ఆధారంగా ఇక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ కమిషనర్ వివరించారు. ఆలయం చుట్టూ సీసీ రాతిపరుపు, తూర్పు రాజగోపురం ముందు భాగంలో సీసీ ఫ్లోరింగ్, ప్రాంగణంలో నాల్గు ఐ మాక్స్ లైట్ల ఏర్పాటు, నూతనంగా 24 టాయిలెట్ల నిర్మాణం, సెంట్రల్ స్టోర్ నిర్మాణం, ఆలయం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, దేవస్థానం కార్యక్రమ వివరాలు తెలిసేలా బోర్డుల ఏర్పాటు, గోశాల విస్తరణ, నూతన సేవ టికెట్స్, లడ్డూ కౌంటర్ బుకింగ్ కౌంటర్లు, భక్తుల సౌకర్యార్థం వీఐపీ లాంజ్ ఒకేసారి వెయ్యి మంది భక్తులు సేద తీరే విధంగా 2 పెద్ద షెడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశామని తుంగభద్ర కాలువ వద్ద బళ్లారికి చెందిన భక్తుడు తిప్పయ్య ఇచ్చిన 1.11 ఎకరాల స్థలంలో డార్మింటరీహాల్, కళ్యాణకట్ట, టాయిలెట్స్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు డీసీ తెలిపారు. అలాగే ఇటీవల సుమారు రెండు కోట్లతో కోనేరు నిర్మాణానికి బెంగళూరుకు చెందిన భక్తుడు మంజునాథ్ ముందుకు రావడంతో భూమిపూజ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నీటి సదుపాయం

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని మాధవరం మేజర్ కాలువ ఆలయం సమీపంలోనే ప్రవహిస్తుంది. ఈసారి ఉత్సవాల ప్రారంభానికి ముందే తుంగభద్ర డ్యాం నిండటంతో దిగువ కాలువకు సాగు నీరు విడుదల చేశారు. దీంతో భక్తులకు నీటి కష్టాలు తప్పాయి. దీనికితోడు మొదటిసారిగా ఫిల్టర్ చే సిన తాగునీరు ఏర్పాటు చేశారు. ఆలయం లోపల, వెలుపల తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశారు.

ఆలయంపై ప్రత్యేక కథనం

ఆలయానికి సంబంధించి ప లు కథనాలు ప్రచారంలో ఉండగా చారిత్రక ఆధారాలు ఏవీ లభించ లేదు. స్వామి కి నిర్దిష్టమైన ఆకారం లేదు. ఒక సిద్ధ పురుషుడని, వీరభద్ర అంశంతో భూలోకానికి వచ్చిన దైవ దూతగా పెద్దలు చెబుతారు. 16వ శతాబ్దంలో ఈరన్న అనే సిద్ధయోగి ఉరుకుందకు వచ్చి రావి చెట్టు కింద లక్ష్మీనరసింహ స్వామి కొరకు తపస్సు చేసి ఆ రావి చెట్టులో స్వామి ఐక్యమయ్యారని ప్రతీతి. ఈ చెట్టు చుట్టూ కట్టను నిర్మించారు. స్వామి ఇప్పటికీ రాత్రివేళ సర్ప రూపంలో, సాధువు రూపంలో సంచరిస్తుంటారని భక్తులు విశ్వసిస్తున్నారు. స్వామిపై విశ్వాసం ఉంచే వారికి అన్నీ శుభాలే జరుగుతాయని నమ్ముతారు. ఇక్కడ మతపరమైన భేదాలు లేవు. హిందువులే కాక ముస్లింలు కూడా స్వామి వారి దర్శనార్థం వస్తుంటారు. పిలిస్తే పలికే ఈరన్నగా, కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మి నరసింహగా భక్తులు స్వామిని పూజిస్తారు. ఒక్కసారి స్వామి దర్శనార్థం వస్తే 9 సార్లు 9 ప్రదక్షిణలతో స్వామి దర్శనం చేయాలని ప్రతీతి. భక్తి ప్రవృత్తులతో స్వామివారి ఆలయ ప్రాంగణంలో నైవేద్యం సమర్పించటం ఆచారం.

నకిలీ ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త



విక్రాంత్ పాటిల్, జిల్లా ఎస్పీ

కర్నూలు(హాస్పిటల్): ఈ–చలాన్ పేరుతో వస్తున్న నకిలీ ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, తొందరపడి వాటిని క్లిక్ చేయవద్దని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఆర్‌టీఓ ట్రాఫిక్ చలాన్. ఏపీకే పేరుతో వచ్చే లింక్‌ను నమ్మవద్దన్నారు. నకిలీ ఏపీకే ఫైల్స్ క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతారని, మీ డబ్బును దోచేస్తా రని చెప్పారు. ఇదివరకు పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీ ఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కేవైసీ అప్‌డేట్ పేర్లతో సైబర్ మోసాలకు పాల్పడే నేరగాళ్లు నూతన ఎత్తుగడకు పథకం వేసి ట్రాఫిక్ చలానా పేరుతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను లూటీ చేసేందుకు సిద్ధమయ్యారని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ–చలాన్ పేరున నేరం ఇలా...

ముందుగా నకిలీ ఏపీకే ఫైల్‌ను నమ్మదగిన వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తారు. ఆ గ్రూపులో ఉన్న సభ్యులు దాన్ని నమ్మి ఆలోచించకుండా క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసుకుంటారు. వెంటనే మీ అనుమతి లేకుండా క్రెడిట్ కార్డు నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిగినట్లు మెసేజ్‌లు వస్తాయని ఎస్పీ వివరించారు. ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేస్తే అది మీ ఎస్ఎంఎస్‌లను యా క్సెస్ చేసి ఓటీపీలను తెలుసుకుంటుందన్నా రు. మీ బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు వివరాలను కూడా తెలుసుకుంటుందని, మీ ఫోన్‌ను ఓ రిమోట్ మాదిరిగా సైబర్ నేరగాళ్లు నియంత్రిస్తారన్నా రు. గుర్తు తెలియని, అనధికార లింక్‌లను క్లిక్ చేయరాదని, యాప్స్‌ను ఎల్లప్పుడూ గూగుల్ ప్లే స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.ఓటీపీ అలర్ట్స్‌ను ఎనేబు ల్ చేసుకోవాలని, ఏవైనా అనుమతి లేకుండా లావాదే వీలు జరిగినట్లు అనుమానాస్పదంగా అనిపిస్తే వెంట నే కార్డును బ్లాక్ చేయాలన్నారు.సైబర్ నేరాల పట్ల 1930 ఫోన్ నంబర్ లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

మినుము విత్తన ప్యాకెట్లు మాకొద్దు!

- జిల్లాలో సాగు లేదంటూ 6,000 ప్యాకెట్లను వెనక్కి పంపిన వైనం

కర్నూలు(అగ్రికల్చర్): మేలు రకం మినుము విత్తనాలను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్నా రైతులతో సాగు చేయించలేక వ్యవసాయ అధికారు లు చేతులెత్తేస్తున్నారు. ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రీషియన్ మేనేజ్‌మెంటు) కింద కింద జిల్లాకు మినుము విత్తనాలు 7,300 నాలుగు కిలోల బ్యాగులు (292 క్వింటాళ్లు) వచ్చా యి.వీటిని ఏపీసీడ్స్, హెచ్ఐఎల్, ఎన్ఎస్‌సీ సరఫరా చేశారు. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం ' మా ప్రాంతంలో మినుము సాగు లేదని, మినుము ప్యాకెట్లు మా కొద్దు'అంటూ తిప్పిపంపడానికి ప్రయ త్నం చేశారు.జిల్లాకు 7,300 ప్యాకెట్లు సరఫరా కాగా ..మొదట అన్నింటిని వెనక్కి పంపాలని భావించా రు.కాని జిల్లా వ్యవసాయఅధికారులు ఒత్తిడి తెచ్చి అన్ని మండలాల్లో కనీసం 1,300 ప్యాకెట్లతోనైన మి నుము సాగు చేయించండని సూచించారు. జిల్లాలోని 25 మండలాల్లో 1,300 ప్యాకెట్లు ఉంచారు.ఒక్కో మండలంలో 10 నుంచి 60 ప్యాకెట్ల వరకు ఉంచిన ట్లు తెలుస్తోంది.చివరికి 6,000 ప్యాకెట్లు (240 క్వింటాళ్లు) వెనక్కి పంపారు.ఉచితంగా వస్తున్న విత్తనాల ను సద్విని యోగం చేసుకోవాల్సిన బాధ్యత వ్యవసా య అధికారులపై ఉంది. రైతులకు అవగాహన కల్పిం చలేక ఉచితంగా సరఫరా చేసిన మిను ముల్లో ఏకంగా 6000 ప్యాకెట్లు వెనక్కిపంపారు. మొత్తం 1,300 ప్యాకెట్లతోనై మినుముసాగు చేయిస్తారా.. దుర్వినియోగం చేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కుటుంబంలో మద్యం చిచ్చు

- ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె: పచ్చని కుటుంబంలో మద్యం చిచ్చు రేపింది. దంపతుల మధ్య కలహాలకు కారణమై కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తిని బలితీసుకుంది. వివరాలు.. మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు (35)కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. బోయ శ్రీనివాసులు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో కొనుగోలుకు గతంలో అప్పు చేశాడు. ఈ క్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసై డబ్బంతా తాగుడుకు ఖర్చు చేసేవాడు. మద్యం అలవాటు మానుకొని అప్పులు తీర్చాలంటూ భార్య కళావతి భర్తతో గొడవ పడేది. భర్త తీరు మారకపోవడంతో కొద్దిరోజుల క్రితం పుట్టినిల్లు ప్యాపిలికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాసులు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనివాసులుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లింక్ నొక్కితే బ్యాంకు ఖాతా ఖాళీ



బాధితుడు లక్ష్మీనారాయణ

కోసిగి: మండల పరిధిలోని అర్లబండ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ బ్యాంకు ఖాతాలోని డబ్బు ను సైబర్ ముఠా దోచేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డును ఉపయోగిస్తే పెనాల్టీ, ప్రాసెసింగ్ ఫీజు వంటివి ఉండవని పేర్కొంటూ ఇటీవల అతని సెల్‌ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేయగా సాయంత్రంలోగా అతని ఖాతాలో ఉన్న రూ.18,500 నగదు మాయమైంది. ఘటనపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు ఖాళీ అయిన దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో చూపుతూ సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని వాపోయారు.

రైతులూ.. ఎన్‌పీసీఐ చేయించుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి జిల్లాలో 7063 బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ గుర్తింపు లేదని, మరో 1692 ఖాతాలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జరగలేదని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఎన్‌పీసీఐ కింద మ్యాపింగ్ కాని రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సాయం జమ చేయడం సాధ్యం కాదని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్‌పీసీఐ గుర్తింపు పొందని ఖాతాదారులు, అనుసంధానం కాని ఖాతాల వివరాలు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు పంపినట్లు తెలిపారు. రైతులు వెంటనే సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను కలిసి తమ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్, మ్యాపింగ్ చేయించుకోవాలని సూచించారు.

నంద్యాలజిల్లాలో

నంద్యాల(అర్బన్): జిల్లాలో రైతులందరూ ఎన్‌పీసీఐ(ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం) చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతులకు సంబంధించి 5028 బ్యాంక్ ఖాతాలు ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 1,251 మంది లబ్ధిదారుల వివరాలు మ్యాపింగ్ జరగలేదని తెలిపారు.

అనంతపురం డీపీఓపై దాడి దారుణం

- జిల్లా ఎన్‌జీఓ నేత వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ అధికారులపై అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడినా.. పరుషమైన పదజాలంతో దూషించినా సహించేది లేదని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి దాడి యత్నం చేయడం దారుణమైన విషయమని పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..జిల్లా పంచాయతీ అధికారిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి దుర్భాషలాడం గర్హనీయమని, ఇటువంటి సంఘటనలు అధికారుల మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తాయన్నారు. ఇటువంటి సంఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీ కేసీహెచ్ కృష్ణుడు, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకులు మోహన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ లీక్‌తో గందరగోళం



సూపర్ స్పెషాలిటీ భవనంలో దెబ్బతిన్న ఆక్సిజన్ పైప్‌లైన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం పైపుల ద్వారా వెళ్లే ఆక్సిజన్ లీకైంది. సూపర్ స్పెషాలిటీ భవనంలో ఉదయం 10.30 గంటల సమయంలో ఆక్సిజన్ పైపులైన్‌పై కోతులు ఊగిసలాడటంతో పెద్ద శబ్దంతో రంధ్రం పడింది. రంధ్రం నుంచి ఆక్సిజన్ లీకైంది. ఆ ధాటికి పైపునకు ఆనుకుని ఉన్న ఇనుప మెట్లకు కన్నం పడింది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మరమ్మతు చర్యలు ప్రారంభించారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి దెబ్బతిన్న పైపులైన్‌కు ఆక్సిజన్ సరఫరా నిలిపివేశారు. వెల్డింగ్ చేసి పైపులైన్‌ను సరి చేశారు. ఆ సమయంలో రోగులకు సిలిండర్ల ద్వారా ఆక్సిజన్ అందించారు. ఆసుపత్రిలో కోతుల బెడద కారణంగా రెండు నెలల క్రితం చిన్నపిల్లల విభాగంలో ఆక్సిజన్ పైపులైన్ లీకైంది. అప్పుడు కూడా ఎక్కువ శాతం ఆక్సిజన్ వృథాగా పోయింది. ప్రస్తుతం జరిగిన సంఘటనతో రోగులకు ఇబ్బంది రాకపోవడంతో అధికారులతో పాటు ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు.

ఏపీ జలాలపై వివాదం సృష్టిస్తున్నారు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: ఏపీ జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం వివాదాలు సృష్టిస్తోంది. రాయలసీమ రైతులు భూములు త్యాగం చేసి కూడా నీరు వాడుకోలేని పరిస్థితి నెలకొంది. పెండింగ్ ప్రాజెక్టులు, బానకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం దారుణమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం కర్నూలులో మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతం కోసం పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్ జిల్లాల పర్యటనను ప్రారంభిస్తున్నారన్నారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి పర్యటన ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. టీటీడీలో పనిచేసే అన్యమతస్తులు స్వచ్ఛందంగా వైదొలగాలని కోరారు. అక్రమంగా ప్రాజెక్టులు నిర్మించిన తెలంగాణ సముద్రంలోకి వెళ్లే జలాలను తాము వాడుకుంటామంటే వివాదం సృష్టిస్తోందని వాపోయారు. ఆంధ్ర ప్రజల నోట్లో మట్టికొట్టడానికే తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులపై కేంద్రానికి లేఖ రాసిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పులు కప్పి పుచ్చుకోవడానికే సెంటిమెంట్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఈ నెల 28న నంద్యాల, 29న కర్నూలు జిల్లాల్లో పర్యటిస్తారని వెల్లడించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రామస్వామి, పురుషోత్తం రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పశువుల షెడ్లు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో 2025–26 సంవత్సరంలో కూడా పశువుల షెడ్లు నిర్మించనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డుతో పాటు పశువులు కలిగిన ప్రతి రైతు షెడ్లు నిర్మించుకోవచ్చన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు 1200, నంద్యాల జిల్లాకు 850 పశువుల షెడ్లు మంజూరయ్యాయన్నారు. 2, 4, 6 పశువులకు షెడ్లు నిర్మించుకోవచ్చని.. 90 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. పశుసంవర్ధక శాఖ లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు.

బ్యాంకుకు వెళ్లి వస్తానని వివాహిత అదృశ్యం



కుమ్మరి రాజేశ్వరి (ఫైల్)

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామంలో పొదుపు సంఘాల బుక్ కీపర్‌గా పనిచేస్తున్న కుమ్మరి రాజేశ్వరి (27) బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 7వ తేదీన కుమ్మరి రాజేశ్వరి బడికి వెళ్లి పిల్లలకు అన్నం తినిపించి, అలాగే బ్యాంకుకు వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లింది. తర్వాత ఇంటికి తిరిగి రాకపోవడంతో ఈ నెల 8న ఆమె భర్త కుమ్మరి ఆదినారాయణ ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పెద్దగా స్పందించకపోవడంతో బుధవారం ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డిని కలిసి విషయం తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రామచంద్రయ్యపై అనుమానం ఉందని పేర్కొనడంతో పోలీసులు ఆయన్ను స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. అలాగే అనంతపురం జిల్లా గుంతకల్లులోని హోటల్, మద్దికెరలోని ఇంటికి కూడా తీసుకెళ్లి విచారణ చేశారు. కుమ్మరి రాజేశ్వరి ఆచూకీ తెలిసిన వారు ఆలూరు సీఐ నంబర్ 91211 01157 లేదా ఎస్ఐ 91211 01158 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బీటెక్ చదవొద్దన్నందుకు భర్తపై కేసు

ఆదోని అర్బన్: బీటెక్ చదవొద్దన్న భర్తపై భార్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఘటనపై ఆదోని త్రీటౌన్ ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఎంఐజీ కాలనీకి చెందిన వర్షితకు మేనత్త కొడుకు అయిన బనగానపల్లికి చెందిన ఓంప్రకాష్‌తో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. దంపతులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. సంతానం లేదు. వర్షిత హైదరాబాదులో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో దంపతుల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. వర్షితను చదువు మాన్పించేందుకు భర్త ఒత్తిడి తెచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన వర్షిత ఆదోనిలోని పుట్టింటికి చేరుకుంది. ఘటనపై బుధవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమె భర్తను పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చినా కూడా భార్యను చదివించేందుకు ఓంప్రకాష్ ఒప్పుకోలేదు. దీంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త ఓంప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.